క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

తిరువూరు: మండలంలోని ముష్టికుంట్లలో బుధవారం ఉదయం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. గ్రామంలో సంక్షేమ పథకాల లబ్ధిదారులను కలిసి వారికి ప్రభుత్వం నుంచి అందిన ప్రయోజనాలను ఎమ్మెల్యే కే రక్షణనిధి వివరిస్తారని పేర్కొన్నారు.

తల్లీబిడ్డల ఆరోగ్యం కోసమే కిల్కారి

గంపలగూడెం: గర్భిణులు, తల్లీబిడ్డల ఆరోగ్య రక్షణ ధ్యేయంగా ప్రభుత్వం కిల్కారి సేవలను అమల్లోకి తెచ్చిందని గంపలగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కే శ్రీనివాస్ తెలిపారు. గంపలగూడెం, ఉటుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మంగళవారం ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. కిల్కారి సేవల గురించి మహిళలు బాలింతల్లో అవగాహన కల్పించాలని సూచించారు. సెల్‌ఫోన్ ద్వారా అందించే ఈ సేవలతో గర్భిణీ, బాలింతలు, ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకోవడం జరుగుతుందన్నారు. ఏమైనా సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే వైద్యుల ద్వారా తగిన పరిష్కారం తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ విషయమై ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు.

విద్యార్థులకు గ్లాసుల వితరణ

తిరువూరు: మండలంలోని గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన స్టీలు గ్లాసులను దాతలు మంగళవారం వితరణ ఇచ్చారు. గ్రామానికి చెందిన కనకమేడల జయప్రకాష్ నారాయణ జ్ఞాపకార్థం ఆయన భార్య భారతి ఈ గ్లాసులను హెచ్ఎం ఆదిలక్ష్మికి అందజేశారు. రాగిజావ పంపిణీకి ఈ గ్లాసులను వినియోగించనున్నట్లు హెచ్ఎం తెలిపారు.

వాత్సల్య పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

తిరువూరు: అనాథ బాలలకు మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ మిషన్ వాత్సల్య పథకాన్ని ప్రవేశపెట్టిందని తిరువూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి సత్యవతి తెలిపారు. తల్లిదండ్రులు ఇరువురు లేదా ఒకరు మరణించిన కుటుంబంలోని పిల్లలు, అనాథ బాలలు, పాక్షిక అనాథలు, విడాకులు పొందిన తల్లిదండ్రుల పిల్లలు, ప్రకృతి వైపరీత్యానికి గురైన బాలలు, బాల కార్మికులు, యాచకులు, బాల్యవివాహ బాధితులు, హెచ్ఐవీ తదితర ప్రాణాంతక వ్యాధుల బారిన పడినవారికి నెలకు రూ.4 వేల చొప్పున ప్రభుత్వం అందించనుందని తెలిపారు. ఈ నెల 10వ తేదీలోపు అన్ని ధ్రువ పత్రాలతో తమ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని పేర్కొన్నారు.

అగ్నికుల క్షత్రియ సొసైటీ ఏకగ్రీవ ఎన్నిక

త్రిలోచనాపురం(ఇబ్రహీంపట్నం): త్రిలోచనాపురం అగ్నికుల క్షత్రియ ఫీల్డ్ లేబర్ కో–ఆపరేటివ్ సొసైటీ సభ్యుల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగినట్లు నూతన అధ్యక్ష, కార్యదర్శులు కె.శివనాగేశ్వరి, నడకుదిటి కోటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 20న విజయవాడ స్పందనలో ప్రస్తుత పాలకవర్గం గడువు ముగిసిన నేపథ్యంలో ఎన్నికలు నిర్వహించాలని అర్జీ పెట్టగా సహకార సంఘం డీసీఓ శైలజ పాలకవర్గం సభ్యులను ఎన్నుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈమేరకు 52 మంది సభ్యుల్లో 43మంది సమావేశానికి హాజరై ఐదుగురుని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. సొసైటీ నూతన సభ్యులకు సంఘం కార్యకలాపాల పుస్తకాలు ఇవ్వాలని సహకార సంఘం విభాగ అధికారిని కోరినట్లు వారు పేర్కొన్నారు.

దెబ్బతిన్న తోటలు పరిశీలన

ఇబ్రహీంపట్నం: అకాల వర్షాలు, ఈదురు గాలులకు మూలపాడు, జూపూడి, త్రిలోచనాపురం, కొటికలపూడి, లంక ప్రాంతాల్లో దెబ్బతిన్న మొక్కజొన్న, అరటి తోటలను కిసాన్ మోర్చా నాయకులు మంగళవారం పరిశీలించారు. కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు రేగళ్ల రఘునాథరెడ్డి, తదితర నాయకులు రైతుల నుంచి పంట నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఉదార స్వభావంతో రైతులను ఆదుకోవాలని కోరారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

ఆగిరిపల్లి: మండలంలోని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు గుర్తించబడిన కార్పొరేట్ సంస్థలు కృషి చేయాలని తహసీల్దార్ ఎం.ఉదయ్‌భాస్కరరావు కోరారు. మండలంలో ఐదు కార్పొరేట్ సంస్థల ప్రతినిధులతో కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటి కార్యక్రమంలో భాగంగా మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆగిరిపల్లిలో పురాతన శోభనాచల స్వామికి చెందిన వరాహ పుష్కరిణి అభివృద్ధి చేసి, సుందరీకరించడం, పార్కు ఏర్పాటు, మండలంలో విద్యార్థులు సంఖ్య ఎక్కువగా ఉండే జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థుల సౌకర్యార్థం కంప్యూటర్ల ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. డీటీ పవన్‌కుమార్, ఆర్ఐ ఎన్‌వీ రమణ, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ బి.ప్రసాద్, వీఆర్వోలు పాల్గొన్నారు.

సంక్షేమ రథసారథి సీఎం వైఎస్ జగన్

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



నూజివీడులో మహిళలకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: రాష్ట్ర సంక్షేమ రథసారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, ఆయనకు రాబోయే ఎన్నికల్లో మహిళలందరూ అండగా ఉండాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం నూజివీడు పట్టణ, మండలానికి సంబంధించిన వైఎస్సార్ ఆసరా వారోత్సవాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ప్రతాప్ మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా పథకం మహిళల ఆర్థిక స్వావలంబనకు బాసటగా నిలుస్తుందన్నారు. పట్టణంలో మూడు విడతల్లో రూ.20 కోట్లు, నూజివీడు మండలంలో రూ.45 కోట్లను మహిళల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమచేసిందన్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని ధ్వజమెత్తారు. చంద్రబాబును నమ్మి ఓటేస్తే ప్రస్తుతం అమలవుతున్న అమ్మ ఒడి, రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ, వాహనమిత్ర, కాపునేస్తం తదితర పథకాలేవీ ఉండబోవన్నారు. నూజివీడులో మూడో విడతలో 662 సంఘాల్లోని 6,385 మంది సభ్యులకు రూ.6.79 కోట్లు, మండలంలో 1,527 సంఘాల్లోని 15,967 మంది సభ్యులకు రూ.15.49 కోట్లను ప్రభుత్వం మహిళల ఖాతాల్లో జమ చేసిందన్నారు. జగన్ అంటే నమ్మకమని, టీడీపీ ఎన్ని కుయుక్తులు పన్నినా వైఎస్ జగన్‌ను ఏమీ చేయలేరన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ, మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, కృష్ణా జిల్లా వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పిళ్లా చరణ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మద్దిరాల కోటమ్మ, ఎంపీపీ ఆరేపల్లి శిరీషా ప్రసంగించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్, ఎంపీడీఓ సుందరి, వైస్ ఎంపీపీలు అక్కినేని శ్రీవాణి, దండుబోయిన స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరు బస్సును వెంటనే పునరుద్ధరించాలి

ఆర్టీసీ ఈడీ ఆపరేషన్స్‌కు తెలిపిన ఎమ్మెల్యే మేకా ప్రతాప్



నూజివీడు: ఆర్టీసీ అధికారులు నూజివీడు డిపోను నిర్వీర్యం చేయాలని ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకోనని, రద్దు చేసిన బెంగళూరు బస్సు సర్వీసును వెంటనే పునరుద్ధరించాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. నూజివీడు డిపో నుంచి రెండు బెంగళూరు సర్వీసులుండగా ఇటీవల ఒక సర్వీసును అధికారులు తొలగించిన విషయాన్ని యూనియన్ నాయకులు పలువురు మంగళవారం ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో పదేళ్ల నుంచి తిరుగుతున్న సర్వీసును అర్ధాంతరంగా తనకు చెప్పకుండా ఎందుకు తీసేశారని ఎమ్మెల్యే ప్రతాప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పటి నుంచో ఉన్న సర్వీసులను ఎలా తీసేస్తారని ప్రశ్నించారు. సర్వీసును రద్దు చేయడంపై ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆపరేషన్స్‌తో ఫోన్‌లో మాట్లాడి వెంటనే సర్వీసును ఏర్పాటు చేయాలన్నారు. డిపోను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధిగా తనపై ఉందని, శ్రీశైలంకు కూడా బస్సు సర్వీసును నడపాలని తాను చర్యలు తీసుకుంటుంటే బెంగళూరు బస్సును తన దృష్టికి తీసుకురాకుండా ఎందుకు రద్దు చేశారో సమాధానం చెప్పాలన్నారు. హైదరాబాద్ సర్వీసులు, విజయవాడ నాన్‌స్టాప్ సర్వీసులు, విశాఖపట్నం సర్వీసులకు జనం బాగా ఎక్కుతున్నారని, సమయపాలన, బస్సుల కండీషన్ సరిగా ఉంటే ప్రయాణికులు ఆదరిస్తారన్న విషయాన్ని ఆర్టీసీ ఉన్నతాధికారులు తెలుసుకోవాలన్నారు. బస్సు సర్వీసులు ఏవైనా రద్దు చేయాలనే సమాచారం ఉన్నతాధికారుల నుంచి వస్తే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే డీఎం పవన్‌కుమార్‌కు తెలిపారు.

పోలవరంలో డ్రోన్ సర్వే



చాట్రాయి: మండలంలోని పోలవరంలో మంగళవారం డ్రోన్ సర్వేను జెడ్పీటీసీ సభ్యురాలు చెలికాని అనూషా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానంతో డ్రోన్ సర్వేను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. ఈ సర్వేతో భూ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. సర్పంచ్ సత్తెనపల్లి లక్ష్మీ,పీఏసీఎస్ చైర్మన్ చెలికాని బాబ్జీ, తహసీల్దార్ విశ్వనాథరావు, సర్వేయర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నేడు జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ

ఆగిరిపల్లి: మండలంలోని ఈదర ఎస్సీవాడలో బుధవారం బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ కార్యక్రమం జరగనుంది. సాయంత్రం ఐదు గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు హాజరవుతారని ఎంపీపీ గోళ్ల అనూషా ఇసాక్ తెలిపారు.

మే 13న జాతీయ లోక్ అదాలత్

నూజివీడు: పట్టణంలోని కోర్టు ఆవరణలో మే 13వ తేదీన జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు, పరిష్కరింపదగిన క్రిమినల్ కేసులు, మోటార్ వాహనాల కేసులు, వివాహ సంబంధ తదితర కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చని, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రేపటి నుంచి మారెమ్మ అమ్మవారి వార్షిక తిరునాళ్ల



విస్సన్నపేట: మండలంలోని పుట్రేల గ్రామంలో మారెమ్మ అమ్మవారి వార్షిక తిరునాళ్ల మహోత్సవం ఈ నెల 6 నుండి 10వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వై సీతారామయ్య, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కోటగిరి వెంకట సత్య శేష సునీల్ కుమార్, ధర్మకర్తల మండలి సభ్యులు మంగళవారం తెలిపారు. ప్రతి రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

కంచి రామారావుకు పలువురి నివాళి



తిరువూరులో కంచికి నివాళులర్పిస్తున్న నాయకులు

తిరువూరు: అనారోగ్యంతో కన్నుమూసిన మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ కంచి రామారావుకు మంగళవారం పలువురు నివాళులర్పించారు. తిరువూరులోని ఆయన స్వగృహంలో మాజీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్, తిరువూరు మాజీ ఎమ్మెల్యేలు పద్మజ్యోతి, శ్రీరాంతాతయ్య, స్వామిదాసు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సుధారాణి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగురాజు రుద్రరాజు, నియోజకవర్గ కన్వీనర్ రాజీవ్‌రతన్, పీసీసీ సభ్యులు కంచి రామారావు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: మార్క్ఫెడ్ మాజీ చైర్మన్ కంచి రామారావుకు గంపలగూడెం, పెనుగొలనులో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఘనంగా నివాళులర్పించారు. వృద్ధాప్యం కారణంగా ఆయన సోమవారం మృతి చెందిన నేపథ్యంలో పెనుగొలనులో రాధా రంగ మిత్ర మండలి, కాపు సంఘం ఆధ్వర్యంలో కాపు కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కాపు సంఘం నాయకులు రామిశెట్టి సత్యనారాయణ, నూకల కృష్ణ, మీసాల సత్యనారాయణ, పిల్లంశెట్టి విశ్వనాథ నాగేశ్వరరావు, అన్నవరపు క్రాంతికుమార్, రాధా రంగా మిత్ర మండలి సభ్యులు రామయ్య, సురేష్, రామకృష్ణ, అంజియ్య పాల్గొన్నారు.

‘మా నమ్మకం నువ్వే జగన్’ కిట్ల పంపిణీ



తిరువూరు మండలం రోలుపడిలో కిట్ల పంపిణీ



కొండపర్వలో కిట్ల పంపిణీ

తిరువూరు: మండలంలోని పలు గ్రామాల్లో ‘మా నమ్మకం నువ్వే జగన్’ కార్యక్రమానికి సంబంధించిన కిట్లను మంగళవారం పంపిణీ చేశారు. రోలుపడి, కాకర్ల, ఆంజనేయపురం గ్రామ సచివాలయాలలో జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు బండి రవికుమార్, తాళ్లూరి నవీన్‌కుమార్ ఈ కిట్లను పార్టీ కన్వీనర్లకు అందజేశారు. పార్టీ అధిష్టానం సూచనల మేరకు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. గ్రామ సర్పంచ్‌లు ముండ్లపాటి కాంతమ్మ, తాళ్ళూరి రాధారుక్మిణి, మామిడి కుటుంబరావు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కొండపర్వ (విస్సన్నపేట): సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా గ్రామ సచివాలయం కన్వీనర్లు, గృహసారథులకు, వలంటీర్లు కృషి చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కొండపర్వ, తాతకుంట్ల గ్రామాల్లో ‘మా నమ్మకం నువ్వే జగనన్న’ కిట్లను మంగళవారం గ్రామ సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, వైస్ఎంపీపీ గాజుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బీజేపీ బూత్ కమిటీల నిర్మాణం వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న కొరళ్ల జ్యోతి సుధాకర్ కృష్ణ

నూజివీడు: గ్రామ స్థాయిలో బీజేపీ బలోపేతం కావాలంటే బూత్ కమిటీల నిర్మాణం ఆవశ్యమని పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు కొరళ్ల జ్యోతిసుధాకర్ కృష్ణ అన్నారు. నూజివీడులోని పీవీఎస్ఆర్ కల్యాణ మండపంలో మంగళవారం బూత్ స్వశక్తి కరణ్ అభియాన్ అసెంబ్లీ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఈ నెల 7నుంచి 16 వరకు అసెంబ్లీ స్థాయిలో ఉన్న 58 శక్తి కేంద్రాల పరిధిలోని 277 బూత్ కమిటీలను ఏర్పాటు పూర్తి చేయాలన్నారు. అదే విధంగా 6న పార్టీ ఆవిర్భావ దినోత్సవం, 14న అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలన్నారు.

ఉత్తమ పౌరులుగా ఎదగాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): బాలురు నేర ప్రవృత్తిని వీడి ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు డాక్టర్ రాజేంద్రప్రసాద్ అన్నారు. విద్యాధరపురం కబేళా రోడ్డులోని ప్రభుత్వ బాలుర పరిశీలన గృహాన్ని (జువెనైల్ హోమ్) ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం, కమిషన్ చేపడుతున్న చర్యలను వివరించారు. మనిషికి కేవలం హక్కులు మాత్రమే కాదని బాధ్యతలు కూడా ఉన్నాయని తెలిపారు. వాటిని బాధ్యతగా నెరవేర్చినప్పుడే సమాజంలో గుర్తింపు ఉంటుందన్నారు. తెలిసీ తెలియని వయసులో మన చుట్టుపక్కల వాతావరణం, కొన్ని చెడు సావాసాలతో తప్పులు చేయవచ్చన్నారు. ఆ తర్వాత తప్పు తెలుసుకుని పరివర్తన చెందితే ఇతర బాలురకు ఆదర్శంగా నిలుస్తారని అన్నారు. కార్యక్రమంలో జువెనైల్ వెల్ఫేర్ శాఖ చీఫ్ ప్రొహిబేషన్ సూపరింటెండెట్ మధుసూదనరావు, హోం సూపరింటెండెంట్ రామమోహన్ రెడ్డి, ప్రొహిబేషన్ అధికారి హసన్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ సభ్యుడు ప్రతాప్‌కు పౌర సన్మానం



జెడ్పీటీసీ సభ్యుడు ప్రతాప్‌ను సన్మానిస్తున్న నాయకులు

ముసునూరు: మారుమూల ప్రాంతానికి చెందిన మండల స్థాయి నేత గౌరవ డాక్టరేట్‌కు ఎంపిక కావడం ముదావహమని రమణక్కపేట సర్పంచ్ రంగు ధనలక్ష్మి గాంధీ అన్నారు. రమణక్కపేటలో మంగళవారం వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, ఉప సర్పంచ్ రంగు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎంపీటీసీ కొండా దుర్గాభవాని వెంకట్రావు అధ్యక్షతన ఇటీవల గౌరవ డాక్టరేట్‌కు ఎంపికైన ముసునూరు జెడ్పీటీసీ సభ్యుడు వరికూటి ప్రతాప్‌కు పౌర సన్మానం నిర్వహించి, శాలువలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను బహూకరించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు నామముల లక్ష్మయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు ఉప్పే రామకృష్ణ, కడియం నాగాచారి, తోట సుబ్బారావు, దగ్గుమిల్లి సుధీర్‌బాబు పాల్గొన్నారు.

రూ.3.5 కోట్లతో దేవుని చెరువులో అభివృద్ధి

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్



దేవుని చెరువులో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్

మైలవరం: మైలవరం దేవుని చెరువులో రూ.3.5కోట్లతో పలు చోట్ల డ్రెయినేజీలు అభివృద్ధి పనులు, సిమెంట్ రహదారులు ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. మైలవరంలోని గ్రామ సచివాలయం–4 పరిధిలోని దేవుని చెరువులో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వసంత ఇంటింటికీ తిరిగి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను గ్రామస్తులకు వివరిస్తూ, అర్హతలే ప్రామాణికంగా తమ నాయకుడు, ముఖ్యమంత్రి జగన్ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. గడచిన మూడు దశాబ్దాలుగా దేవుని చెరువు అభివృద్ధి పనుల విషయంలో నిర్లక్ష్యానికి గురైందన్నారు. ఇంకా డ్రెయిన్లు, రహదారుల నిర్మాణ పనులు ఉన్నాయని, త్వరలో వాటిని చేపడతామన్నారు. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికే గడప గడపకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమం పూర్తయిన అనంతరం రూ.20లక్షలతో అభివృద్ధి పనుల చేపటనున్నట్లు పేర్కొన్నారు. ప్రజల సమస్యలు విని, వాటి పరిష్కారానికి తగు ఆదేశాలను అధికారులకు జారీ చేశారు. మైలవరంలో వైఎస్సార్ సీపీ కార్యకర్త షేక్ వెంకన్న కుమారుడు రజాక్(32) గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

నాడు–నేడు పనులు వేగవంతం చేయాలి



తోటమూల కేజీబీవీలో నాడు–నేడు పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కనుమూరు/తోటమూల(గంపలగూడెం): పాఠశాలల్లో నాడు–నేడు పథకంలో మంజూరైన పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. గంపలగూడెం మండలం కనుమూరు జెడ్పీ ఉన్నత పాఠశాల, తోటమూల కస్తూర్బాగాంధీ ఆశ్రమ పాఠశాలల్లో నాడు–నేడు పథకంలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల, మరుగుదొడ్ల నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. పనుల్లో తగిన నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్ సహాయకులను ఆదేశించారు. కనుమూరు, అనుముల్లంకల్లో గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ తనిఖీ చేశారు. కేజీబీవీ ప్రత్యేక అధికారి ఎం.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేను సక్రమంగా నిర్వహించాలి



ముసునూరులో రీసర్వేపై అవగాహన కార్యక్రమం

ముసునూరు: భూముల రీసర్వేను సమర్థవంతంగా సంపూర్ణ అవగాహనతో సక్రమంగా నిర్వహించాలని నూజివీడు డీఐఎస్ వరహాల రాజు, షేక్ హుమాయూన్ బేగ్ పేర్కొన్నారు. స్వామిత్వ సర్వే, భూహక్కు, భూపరిరక్షణ కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ కార్యాలయంలో తహసీల్దార్ దాసరి సుధ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లకు డ్రోన్ కెమేరాలతో సర్వే నిర్వహణ విధానంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీ నుంచి 27 వరకు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో జరుగనున్న సర్వేపై సంపూర్ణ అవగాహనతో నిర్వహించాలన్నారు. వైస్ ఎంపీపీ కె.రాజానాయన, జెడ్పీటీసీ సభ్యుడు వరికూటి ప్రతాప్, వ్యవసాయ సొసైటీ అధ్యక్షుడు ఎం.నాగమల్లేశ్వరరావు, నూజివీడు డీఎల్పీవో వెంకటరత్నం, మండల సర్వేయర్ సురేష్ పాల్గొన్నారు.

ఏఏఎంటీకే దర్బార్లో ఇఫ్తార్ విందు

ఎ.కొండూరు: మండలంలోని చీమలపాడు గ్రామంలో ఏఏఎంటీకే దర్బార్లో పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఉపవాస దీక్షపరులకు దర్బార్ పీఠాధిపతి మహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ షా తాజ్ ఖాదరి బాబా ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ ఈ రంజాన్‌మాసంలో విజయనగరంలో వేంచేసి ఉన్న మహాత్ములు హజరత్ హుజూర్ సయ్యద్ ఖాదర్ షా ఖాదర్ ఔలియా, చీమలపాడు సూఫీ మహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరి బాబా దర్బార్లో రోజూ ఉపవాస దీక్ష పరులకు ఇఫ్తార్ విందు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జాఫర్ షరీఫ్, తాజ్ ఖాదర్‌బాబు, విజయనగరం దర్బార్ పీఠాధిపతి మహమ్మద్ ఖలీల్‌బాబు పాల్గొన్నారు.

71 శాతం పింఛన్ల పంపిణీ



ఆగిరిపల్లిలో వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న వలంటీర్

ఆగిరిపల్లి: మండలంలో వైఎస్సార్ పింఛన్ల పంపిణీ కార్యక్రమం ముమ్మరంగా జరుగుతోంది. మండలంలో పింఛన్లను 71 శాతం గ్రామవార్డు వలంటీర్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ కె.వాణి తెలిపారు. బుధవారం సాయంత్రం లోపు మిగిలిన లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

అలరించిన సంగీత లహరి



విజయవాడ కల్చరల్: సంగీత విద్వాంసుడు, ప్రమోక్త వలివేటి వెంకటలక్ష్మీ నరసింహం జయంతి వేడుకల సందర్భంగా దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో శిష్య ప్రశిష్యులు మంగళవారం సంగీత సాహిత్య కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. భక్తి భావగీత రచయిత వారణాసి వెంకట్రావు రచించిన గీతాలు నిన్నే మున్ను పూజించవలె, కోయిల వాలిన కొమ్మ, చిన్నారి కోయిలమ్మ, నీపాదాలు పట్టి విడువనమ్మా దుర్గమ్మ, ఊయ్యాలలోపాప, దిగిరావమ్మా చినుకమ్మా, తెరను తీయరా, కనులు చూచిన చాలును శ్రీశైలశిఖరమ్ము, తదితర గీతాలను సంగీత కళాశాల సంగీత విభాగం అధ్యాపకురాలు లక్ష్మీనరసమ్మ, సీహెచ్ సుధాశ్రీనివాస్ ఎం. మల్లిక్ మధురంగా గానం చేశారు. నిర్వాహకుడు వలివేటి వెంకటశివరామకృష్ణ మాట్లాడుతూ భక్తి గీతాలు మనోగీతాలుగా అభివర్ణించారు. బుధవారంతో జయంతి ఉత్సవాలు ముగుస్తాయని సంగీత విద్వాంసుడు దావులూరి వీరభద్రరావుకు వీవీఎల్ఎన్ స్మారక పురస్కారం ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఓ ప్రైవేటు కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్న వ్యక్తి అదృశ్యమైన ఘటనపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు... భవానీపురం కబేళా సెంటర్‌కు చెందిన జామి త్రివిక్రమ్‌రెడ్డి ఓ ప్రైవేట్ కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 2వ తేదీ ఉదయం పది గంటలకు డ్యూటీకి వెళ్లి మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చాడు. ఆ తర్వాత బయటకు వెళ్లి వస్తానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. తిరిగి రాలేదు. మొబైల్ స్విచాఫ్ వచ్చింది. దీంతె అతని భార్య చాముండేశ్వరి తెలిసిన వాళ్లు, బంధువులను ఆరా తీసింది. తన భర్త ఆచూకీ తెలియకపోవడంతో భవానీపురం పోలీసులకు పిర్యాదు చేసింది.